చేపపిల్లల విడుదలకు ప్రణాళిక

● **బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**



నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల్లో చేపపిల్లల విడుదల కోసం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేపపిల్లల సైజు తగ్గకుండా పంపాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాకు అవసరమైన మరిన్ని చేపపిల్లలను తెప్పిస్తామన్నారు. మరో నాలుగు నెలల్లో మరిన్ని చేపపిల్లల విత్తనాలు జిల్లాకు వస్తాయన్నారు. ఆయా చెరువుల్లో చేపపిల్లలను వదిలేముందు స్థానిక ఆక్వా రైతులకు, నాయకులకు, అధికారులకు ముందుగా సమాచారం ఇస్తామని ఆయన తెలిపారు.

బజ్జీలు తెచ్చిన పంచాయితీ!

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో టిఫిన్ సెంటర్‌లో బజ్జీల విషయంలో ఏర్పడిన పంచాయితీ ఓ ముగ్గురు యువకులను జైలుకు పంపేలా చేసింది. నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఆకాష్, మనీష్, ప్రమోద్‌లు రెండు రోజుల క్రితం తెల్లవారుజామున నగరంలోని బస్టాండ్ వద్దగల ఓ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ తినేందుకు వెళ్లారు. మరో రెండు బజ్జీలు కావాలని ఆకాష్ హోటల్ ఓనర్‌ను అడగగా డబ్బులు ఇస్తేనే బజ్జీలు ఇస్తానని చెప్పడంతో ఫోన్‌పే చేయగా మరో వ్యక్తి క్యాష్ ఇచ్చి బజ్జీలు తీసుకున్నాడు. అయితే బజ్జీలు అయిపోయాయని హోటల్ యజమాని చెప్పడంతో డబ్బులు ఇచ్చామని బజ్జీలు కావాల్సిందేనని యువకులు హోటల్ యజమాని సచిన్‌తో వాగ్వాదానికి దిగారు. మాటా మాట పెరగడంతో హోటల్ యజమాని ఆకాష్‌పై దాడికి దిగడంతో గాయాలు అయ్యాయి. దీంతో ఆగ్రహంతో ముగ్గురు యువకులు మరుసటి రోజు పెట్రోల్ బాటిల్ తీసుకెళ్లి హోటల్ యజమాని ఇంటిపై విసిరి నిప్పంటించారు. ఘటనపై ఆదివారం సచిన్ మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

డీఎస్సీ-2024 అభ్యర్థులకు
నేడు కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో నియామక పత్రాలు పొందినటువంటి ఎస్జీటీ క్యాడర్, ఎస్జీటీలోని అన్ని మీడియంలు, అన్ని లాంగ్వేజ్ పండిత్‌లు, పీఈటీలకు మంగళవారం కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 103 లోగల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు రూమ్ నెంబర్ 117లో జరిగే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఉదయం 9గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

కలెక్టర్‌కు ప్రముఖుల శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగను పురస్కరించుకొని సమీకృత కలెక్టరేట్‌లో పలువురు ప్రముఖులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఇద్దరు డీఈల బదిలీ

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఇద్దరు డీఈలు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వరంగల్ కంపెనీ ఉన్నతాధికారులు జారీ చేశారు. ఆర్మూర్ డీఈగా పనిచేస్తున్న హరిచంద్‌నాయక్ నిర్మల్ ఎంఆర్‌టీకి బదిలీ చేశారు. నిజామాబాద్ ఎంఆర్‌టీలో పనిచేస్తున్న రాజేశ్వర్‌ను ఆర్మూర్‌కు బదిలీ చేశారు.

17న ఉమ్మడి జిల్లాల
జూనియర్ ఖోఖో ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపికలు ఈనెల 17న నిర్వహించనున్నామని ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖుల్లాలు తెలిపారు. నందిపేట్ మండల కేంద్రంలోని గీత కాన్వెంట్ పాఠశాలలో ఎంపికలను నిర్వహిస్తున్నామని క్రీడాకారులు బోనాఫైడ్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. క్రీడాకారులు 22-11-2006 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. వివరాలకు కార్యనిర్వహణ కార్యదర్శి నాగేశ్వర్‌రావు 8555996 271 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలెప్పుడు?

పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

- జిల్లాలో రూ.100కోట్ల వరకు బకాయిలు
- రెండేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు
- నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాలు
- ఉమ్మడి జిల్లాలో రూ.160కోట్లకు పైగా పెండింగ్



ఆందోళన నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం ద్వా రా ఇచ్చే ఉపకార వేతనాలు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఆందోళనబాటకు సిద్ధమయ్యాయి. గత ప్రభుత్వం చివరిలో స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోగా గత డిసెంబర్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వం సైతం గత ఏడాది నుంచి బకాయిలు విడుదల చేయ డం లేదు. గత రెండేళ్లుగా విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో సుమారు రూ.100కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం ప్రతి ఏడాది ఫీజురీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలను ఆలస్యంగా కేటాయించేది. ప్రస్తుత ప్రభు త్వం కూడా గత రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులంతా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోనే ఫీజురీయింబర్స్‌మెంట్ వేస్తుంది. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు డబ్బులు జమ చేయాల్సి ఉన్నప్పటికీ గత రెండేళ్లుగా నిధులు విడుదల కాక విద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ పూర్తయినప్పటికీ బకాయిలు ఉండటంతో ప్రైవేటు కళాశాలలు సైతం విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. ఫీజులు కడితే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వమని విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. దీంతో ఉన్నత చదువుల కోసం విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ని రవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సోమవా రం నుంచి కళాశాలలను నిరవధికంగా బంద్ చేశారు.

జిల్లాలో వంద కోట్లపైనే బకాయిలు..

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో సైతం వంద కోట్ల పైనే బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్టీ సంక్షేమ శాఖకు సంబంధించి 2023-24 సంవత్సరంలో 5కోట్ల 54లక్షల నిధులు ఇంకా మంజూరు కావాల్సి ఉంది. ఈ విద్యాసంవత్సరం ఇంకా విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఎస్టీ సంక్షేమ శాఖకు సంబంధించి 2020-21, 2021-22, 2022-23 విద్యాసంవత్సరాలకు సంబంధించి 17వేల 195 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 11 వేల 569 మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైంది. మిగిలిన 5వేల 626 మందికి ఇంకా విడుదల కావాల్సి ఉంది. మొత్తం 21కోట్ల 70లక్షలు మంజూరు కావాల్సి ఉండగా 15కోట్లు మంజూరు కాగా ఇంకా 6కోట్ల పైనే బకాయిలు వసూలు కావాల్సి ఉన్నాయి. ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి 2023-24 సంవత్సరానికి ఇంకా 3కోట్ల 61 లక్షల బకాయిలు మంజూరు కావాల్సి ఉంది. 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాలకు గాను ఇంకా 3వేల మంది విద్యార్థులకు సంబంధించి 6 కోట్ల వరకు పాత బకాయిలు రావాల్సి ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖకు సంబంధించి అత్యధికంగా 20వేలకు పైగా విద్యార్థులు జిల్లాలో ఉన్నారు. వీరికి సంబంధించి ప్రతియేడాది 37 కోట్లకు పైగా బడ్జెట్ అవసరం ఉంటుంది. గత ఏడాది అంతంత మాత్రంగానే బడ్జెట్ విడుదల కాగా ఈయేడాది కూడా ఇంకా ఎలాంటి బడ్జెట్ విడుదల కాలేదు. ఈయేడాదికి సంబంధించి ఇంకా స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల గడువు డిసెంబర్ 31 వరకు ఉంది.

నిరవధిక బంద్‌లో డిగ్రీ, పీజీ కళాశాలలు

ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. సోమవారం నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నిరవధిక బంద్‌ను పాటిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఉమ్మడి జిల్లాలో 160 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మా రిందని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చామని యాజమాన్యాలు తెలిపాయి. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ప్రభుత్వ ఆలోచన

గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. అందుకు సంబంధించిన సాధ్య సాధ్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విషయంలో కళాశాలల యాజమాన్యాలు ఏ మేరకు ఆసక్తి చూపుతున్నాయో తెలియాల్సి ఉంది. ఇప్పటికే కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం నుంచి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విషయంలో సమాచారం ఇచ్చారు. కానీ ఎలాంటి ప్రతిపాదనలు వస్తాయి, ఏ మేరకు బకాయిలు తగ్గుతాయి అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. బకాయిల చెల్లింపు విషయంలో ఇప్పటికే ఆలస్యం జరిగి తాము నష్టపోయామని ఇప్పుడు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంటే మరింత నష్టపోయే అవకాశం ఉందని కళాశాలల యాజమాన్యాలు భావిస్తున్నట్లు సమాచారం.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

బోధన్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. మూడు సంవత్సరాలుగా డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కళాశాలల ఉద్యోగుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, మున్సిపల్ ట్యాక్స్, నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలలను నిర్వహించడం కష్టతరంగా మారిందన్నారు. టీయూ పీసీఎంఏ తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంస్థ పిలుపు మేరకు బోధన్ సమన్వయకర్త మిమ్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస రాజు, ఉషోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సూర్యప్రకాష్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సాయిరెడ్డి, విజయసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జావీద్ పాల్గొన్నారు.



కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం



కోటగిరిలో కొనసాగుతున్న దుర్గామాత శోభాయాత్ర

రెండో రోజూ దేవీమాతల నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ దేవీమాతలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. సోమవారం నిర్వహించిన దేవీమాతల శోభాయాత్ర సంబరాలు అంబరాన్నంటాయి. మేళతాళాలు, కళాకారుల వివిధ వేషధారణలు, నృత్యాల మధ్య దేవీమాత ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. దారిపొడవునా భక్తులు మంగళహారతులు, కొబ్బరి కాయలు, నైవేద్యాలను సమర్పించారు. - న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్



భీమ్‌గల్‌లో దుర్గాదేవి శోభాయాత్రలో డప్పు కళాకారుల నృత్యాలు

జిల్లాలో త్వరలో యంగ్ ఇండియా
ఇంటిగ్రేటెడ్ కళాశాల

● **టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా జిల్లాకు త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాల మంజూరు అవుతుందని ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ నాయకులంతా కృతనిశ్చయంతో ఉన్నారని త్వరలోనే సీఎంను కలిసి జిల్లా పారిశ్రామిక అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల 2021 ప్యాకేజీలకు నిధులు విడుదల చేయించి పనులను వేగవంతం చేస్తామన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఆవశ్యకత ఉందని త్వరలోనే మరో మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలో క్రీడాకారుల కోసం మంచి స్టేడియాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఆర్‌వోబీలు పెండింగ్‌లో ఉన్నాయని ఈ విషయంపై ఎంపీ అర్వింద్ స్పందించాలన్నారు. నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేసే విషయంలో ఎంపీ అర్వింద్ కృషి చేయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ఆయన అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, తొమ్మిది నెలల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ ఎంతో అప్పటి ఆర్థిక మంత్రిగా పని చేసిన హరీష్‌రావు చర్చకు సిద్ధమా అని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్



● నవీపేట శివారులో ధాన్యం కుప్పలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడు?

ఊపందుకున్న వరి కోతలు

వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

నవీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరికోతలు ఊపందుకున్నా.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో సుమారు 25,600 ఎకరాలల్లో వరిపంటను రైతులు సాగు చేపట్టగా కొద్ది ఎకరాలల్లో సోయా, ఇతర పంటలను సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు 2320రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2300రూపాయల మద్దతు ధరను చెల్లించనుంది. ప్రస్తుత సీజన్ నుంచి సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించడానికి సిద్ధమయ్యారు. పలు గ్రామాలల్లో దళారులు పచ్చి ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి..

: డాంగే సంతోష్, రైతు, నవీపేట



ఐదు ఎకరాల్లో సన్నరకం వరి కోతలు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి 500రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామని చెప్పడం ఆనందం కలిగింది. అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లిస్తే రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.

త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం..

: వెంకట రమణ, తహసీల్దార్, నవీపేట

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మండలంలో ఇటీవలే వరికోతలు ప్రారంభమయ్యాయి. సొసైటీలు, ఐకేపీల ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

ముగిసిన దసరా సెలవులు

తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు, ఉద్యోగులు

దసరా పండుగ సెలవులు ముగియడంతో విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే వారు సోమవారం తిరుగు ముఖం పట్టారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు, ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కొందరు బస్సులో సీటు కోసం నానా తంటాలు పడ్డారు.

- ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







నగరంలోని బస్టాండ్ ప్రాంగణం ఇలా..







గుండెపోటుతో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికుడి మృతి

బోధన్‌రూరల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలో క్యాజువల్ కార్మికుడిగా పని చేసిన కేశవ్(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ లేఆఫ్ అయినప్పటి నుంచి రావాల్సిన వేతన బకాయిలు రాక కేశవ్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సోమవారం గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్పలత, ఇద్దరు కుమార్తెలు, ఓ కొడుకు ఉన్నారు.

వేల్పూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంక్సాపూర్ గ్రామానికి చెందిన మహిళా రైతులు సోమవారం ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. స్థానిక పాశపు గురడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు మహిళలు భారీగా తరలొచ్చి సందడి చేశారు.



బోధన్‌లోని పల్లెల్లో లోపిస్తున్న పారిశుధ్యం

● పాలకులు లేరు.. ప్రత్యేక అధికారులు రారు ● పల్లెల్లో లోపిస్తున్న పారిశుధ్య నిర్వహణ ● పేరుకుపోతున్న వ్యర్థాలు ● నిండిపోతున్న డ్రైనేజీలు ● పట్టించుకోని యంత్రాంగం

ఆంధ్రజ్యోతి పరిశీలన



సాలూర గ్రామ శివారులో పేరుకుపోయిన చెత్తాచెదారం



కొప్పర్గ వద్ద రోడ్డు పక్కన బురదమయమైన దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లోని పల్లెల్లో పారిశుధ్య లోపిస్తుంది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తచెదారం, మురికి నీరు పేరుకుపోతుంది. బోధన్ డివిజన్‌లోని బోధన్, సాలూర, రుద్రూర్, వర్ని, రెంజల్, ఎడపల్లి, తదితర మండలాల్లోని గ్రామాలలో గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తచెదారం మురికి నీరు ఎక్కడికక్కడే పేరుకుపోతుంది. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అసలే వర్షాకాలం ఆపై పారిశుధ్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాలలో చాలా మంది సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. ఏ ఇంట్లో చూసిన ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. ఒక వైపు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు మరో వైపు పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రోగాలు విస్తరిస్తున్నాయి. గ్రామాలలో కనీసం బ్లీచింగ్ పౌడర్ సైతం చల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది. పారిశుధ్య లోపించడం వల్ల చాలా మంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు.

● పాలకులు లేరు.. ప్రత్యేక అధికారులు రారు

గ్రామ పంచాయతీ కాల పరిమితి 25న ముగిసిన నేపథ్యంలో గ్రామాలో పాలకవర్గాలు లేరు. దీంతో ప్రజాప్రతినిధులు మాజీలయ్యారు. దీంతో పల్లెల్లోని సమస్యలు పరిష్కారం లభించడం లేదు. ప్రత్యేక అధికారులు నియామకం పొందిన వారు విధులకు సక్రమంగా నిర్వర్తించడం లేదని తెలుస్తుంది. ఒక్కో ప్రత్యేక అధికారికి రెండు, మూడు గ్రామాలను కేటాయించడంతో పూర్తిస్థాయిలో నిర్వహణలో జరగడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పెద్దగా అధికారులు దృష్టి సారించడం లేదని తెలుస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులంత ఓటరు జాబితా, సవరణల కార్యక్రమంలో నిమగ్నం కావడంతో పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అలాగే చెత్తను సేకరించే కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదని తెలుస్తుంది. ఈ పరిమాణాలు గ్రామాలలో పారిశుధ్య లోపానికి దారి తీస్తున్నాయి. చెత్తను సేకరించడం, మురికి కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం తదితర పనులు గ్రామాలలో సక్రమగా సాగడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వీటన్నింటికి తోడు గ్రామ పంచాయతీకి వచ్చే నిధులకు బ్రేక్ పడడం కూడా శాపంగా మారింది.

కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు



గ్రామాలలో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. డ్రైనేజీలలో మురికి నీరు పేరుకుపోయి రోడ్లపైకి చేరి దుర్వాసన వస్తుంది. సంబంధిత అధికారులు కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదు. దీంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నాం. మా బాధలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.

- లక్ష్మీ, గృహిణీ,హంగర్గ

బోధన్ గ్రామాభివృద్ధికి సహకరిస్తాం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోధన్ గ్రామాభివృద్ధి కమిటీకి తనవంతు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతనంగా ఎన్నికైన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను జిల్లా కేంద్రంలోని స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన గంగాధర్ రావు పట్వారీని అభినందిస్తూ బోధన్ రాజకీయ అంశాలపై చర్చించారు. గ్రామాభివృద్ధి కమిటీకి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు ఢీకొని ఒకరి మృతి



మృతుడు చిన్న గంగాధర్

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తాలో సోమవారం తెల్లవారు జామున కారు ఢీకొని పెర్కిట్‌కు చెందిన సుద్దపల్లి చిన్న గంగాధర్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెర్కిట్ చౌరస్తాలోని ఓహోటల్‌లో ప్రతీరోజు లాగే చిన్న గంగాధర్ టీ తాగడానికి వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా ఓకారు గంగాధర్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటన వివ రాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కారు నడిపిన రాహుల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గంగాధర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు జీవన్‌రెడ్డి

నవీపేట,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరికి చెందిన తోటుకూరు జీవన్ రెడ్డి(57)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక యంచ గోదావరిలో దూకిఆత్మహత్య చేసుకున్నాడని ఏ ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం జీవన్‌రెడ్డి తన కూతురు సువితకు వివాహం చేయడంతో అప్పులు పెరిగిపోయ్యాయని అన్నారు. గత కొంతకాలం నుంచి తన కుటుంబంతో నిజామాబాద్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడని అన్నారు.ఈ నెల 13న తెల్లవారుజామున 2గంటలకు ఆటోలో యంచ గోదావరి వద్దకు వెళ్లి తాను గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్‌లో తిరుపతిలో ఉంటున్న తన కూతురు సువితకు ఫోన్ చేసి నదిలో దూకాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి భార్య లావణ్య, సంపత్‌రెడ్డి అనే కుమారుడు ఉన్నారని, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాళం వేసిన నాలుగు ఇళ్లల్లో చోరీ

● 2లక్షల నగదు, బంగారం చోరీ



తాళం వేసి ఇంట్లో దొంగలు చిందరవందర పడేసిన వస్తువులు

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):మున్సిపల్‌పరిధిలోని పట్టణంతో పాటు మామిడిపల్లిలో గుర్తు తెలియని దొంగలు తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రాం నగర్‌లో గుండు రఘునాథ్, మాదవి, రవికుమార్ ఇళ్లతో పాటు మామిడిపల్లిలోని ఓ ఇంట్లో ఆది వారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. మాధవి తన ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువలో ఉన్న రెండు తులల బంగారం, రూ.50వేల నగ దును వెళ్లారు. అలాగే పక్కనే ఉన్న బొల్లు రఘునాథ్ కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్ తన అత్తగారింటికి వెళ్ళగా ఇంటి తాళం పగు లగొట్టి రూ.2లక్షల నగదు, కొంత బంగారాన్ని ఎత్తుకెళ్లారు. రవికుమార్ ఇంటి తాళం, అలాగే మామిడిపల్లిలోని ఓఇంటి తాళం ధ్వంసం చేశారు. వారి ఇళ్లలో ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. సంఘటన స్థలాలను క్లూస్‌టీం ఐడీ పార్టీ పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాపు చేస్తున్నట్టు ఎస్సై గంగాధర్ తెలిపారు.

నిమజ్జన ఊరేగింపులో కత్తిపోట్లు

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని విద్యానగర్ కాలనీలో దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపులో వరుణ్ అనే యువకుడిపై సాయి అలియాస్ శ్రీకర్ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపులో వరుణ్ అనే యువకుడు అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో తనకు కాబోయే భర్తకు అమ్మాయి సమాచారం అందించింది. దీంతో తనకు కాబోయే భర్త శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో ఇరువర్గాల వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయాలైన వరుణ్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా తన తమ్ముడు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వాడు కాదని, దాడి చేసిన శ్రీకర్‌ను కఠినంగా శిక్షించాలని అన్న వంశీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సైగంగాదర్ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ

కోటగిరి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని జల్లాపల్లి, లింగాపూర్ గ్రామ శివారులలో వ్యవసాయ పంపుసెట్ల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. లింగాపూర్ ఆబాదిలో 37/25,జల్లాపల్లి 45/25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌ను చోరీ చేశారు.స్థానికులు గమనించి ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. ఏఈ నర్సారెడ్డి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిజామాబాద్ పోలీసు శాఖలో భారీగా బదిలీలు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలోని పోలీసు శాఖలో బదిలీలు జరిగాయి. ఇందుకు సంబంధించి సీపీ కల్మేశ్వర్ సోమవారం సాయంత్రం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. 6గురు ఏఎస్సైలు, 12 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 73మంది కానిస్టేబుళ్లకు బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

బోధన్‌రూరల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అమ్మవారి శోభాయాత్రలో డీజే నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని నోటీసులు ఇచ్చినప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ డీజే కార్యక్రమం నిర్వహించిన ఇద్దరు నిర్వహకులపై కేసులు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా డీజే నిర్వహించడం సరికాదన్నారు. డీజే భారత్ సౌండ్స్ లకన్, ఎంహెచ్ సౌండ్స్ యాజమానిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు పోలీసులు, ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని లేనియెడల కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించని డీజే సీజ్

వర్ని,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా డీజే ఏర్పాటు విషయంపై దుర్గామాత కమిటీలకు అధికారులు నోటీసు ద్వారా డీజే నిర్వహించడం చేయవద్దని తెలిపిన సంబంధిత అధికారుల ఆదేశాలు ధిక్కరించి మోస్రా గ్రామంలో డీజే నిర్వహించిన డీజే ఓనర్ పై కేసు నమోదు చేసినట్లు ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అధికారుల ఆదేశాలు ధిక్కరించి ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేస్తే చట్టపరమైన కేసు చేస్తామని ఆయన హెచ్చరించారు.

దుర్గాదేవి దీక్షను విరమించిన భక్తులు



కదిలిలో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ముప్కాల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గాదేవి శరన్నవ రాత్రిలో అమ్మవారి మాలధారణ చేసి తొమ్మిది రోజుల పాటు నియమ నిష్ఠలతో దీక్షపూజలు చేసిన భక్తులు సోమవారం శ్రీ కదిలి మాతాన్న పూర్ణే శ్వరి సన్నిధిలో మాల విరమణ చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన అమ్మవారి భక్తులు మాతాన్న పూర్ణేశ్వరిదేవికి పూజలు చేసి మాల విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు పంచాక్షరి, శంకర్ పంతులు పాల్గొన్నారు.

సంబురంగా బతుకమ్మ పండుగ

● నేడు ఎడపల్లిలో వేడుకలు

ఎడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మహిళలు, యువతులు ఆటపాటలతో హోరెత్తించారు. దీంతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రమంతటా ఆడపడుచులు దసరా ముందు బతుకమ్మ పండుగను నిర్వహించుకుంటారు. జిల్లాలోని ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా దసరా తరువాత ఐదు రోజులకు బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. ఆ తర్వాత గ్రామ శివారులో ఉన్న బిక్కుంట (బతుకమ్మ) చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఏర్గట్ల, అక్టోబరు 14: రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్ధతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రమార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రాష్ట్ర మార్క్‌ఫెడ్ నాఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించి మద్దతు ధర రూ. 4892లు పొందాలని కోరారు. విక్రయించే రైతులు పాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌తో పాటు స్థానిక ఏఈవో ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, డైరెక్టర్లు సోమ దేవరెడ్డి, ఆడెం గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, దేశబోయిన చిన్న సంజీవ్, బద్ధం ప్రభాకర్, డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కలిసిన డయాలసిస్ బాధితులు

వేల్పూర్,అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, డయాలసిస్ బాధితులు కలిసి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలంటూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కిడ్నీ బాధితులు ప్రజా భవన్‌కు వెళ్లి వారి సమస్యలపై వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందనలేదని ఎమ్మెల్యే ఎదుట బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అయిన పేషెంట్‌లకు ప్రతీనెల రూ.10వేలకు పైగా ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.10 పింఛన్ ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం జీవో ఎంఎస్ 43ద్వారా కిడ్నీ బాధితులకు రూ.10వేలు పింఛన్ ఇస్తుందని, తెలంగాణలో కూడా అలాగే ఇచ్చేలా ప్రభుత్వానికి తమ ద్వారా తెలియజేయాలని కోరారు. తమ సమస్యలను, డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని అసెంబ్లీలో తమ సమస్యలపై ప్రస్తావించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని వారు కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కిడ్నీ బాధిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి బీఆర్ఎస్ పార్టీ తీసుకు వెళ్తుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



వేల్పూర్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద బోధన్ మండలం ఖండ్‌గావ్ గ్రామానికి చెందిన మీసాల లక్ష్మణ్(26)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖండ్‌గావ్ గ్రామానికి చెందిన మీసాల లక్ష్మణ్‌కు గత ఆరు నెలల క్రితం అతని బావ గంగాధర్ వద్ద సాటాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం భార్య చనిపోగా ఇద్దరు పిల్లలతో జీవనం సాగించలేక ఆర్థిక ఇబ్బందుల వల్ల మానసికంగా ఇబ్బంది పడుతూ శనివారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం ఉదయం అటు వైపుగా వెళ్లిన వ్యక్తులకు మృతదేహం కనిపించడంతో సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుడి బావ గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయన్న తెలిపారు.

కందకుర్తిని సందర్శించిన డీఎల్‌పీవో

రెంజల్,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గ్రామాన్ని సోమవారం బోధన్ డీఎల్‌పీవో మధుకర్ సందర్శించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ పనులను పూర్తి చేయాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఎంపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, కారోబార్ సాజిద్ ఉన్నారు.

జాతరకు ముస్తాబైన శ్రీ రాజరాజేశ్వర ఆలయం

డొంకేశ్వర్,అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన నూత్‌పల్లి శివా రులోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ జాతర బ్రహ్మోత్సవాలు 20వ తేదీ వరకు కొనసాగుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలను ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

ఏసీపీ కార్యాలయం ఎదుట దుర్గామాత విగ్రహంతో ధర్నా

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసీపీ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ నాయకులు, యూత్‌క్లబ్ సభ్యులు, హిందు సంస్థ నాయకులు దుర్గామాత విగ్రహంతో ధర్నా నిర్వహించారు.యూత్ క్లబ్‌ల వద్ద సౌండ్‌సిస్టం ప్రారంభించకముందే పోలీసులు సౌండ్ సిస్టంను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. నిబంధనలకు లోబడి రెండు సౌండ్ బాక్స్‌లతో నిమజ్జనం ఏర్పాటుకు యూత్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసుకోగా పోలీసులు అత్యుత్స హం ప్రదర్శించి సౌండ్ బాక్స్‌లు తీసు కువెళ్ళడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పలు యూత్ క్లబ్ సభ్యు లు, ధర్నాకు దిగడంతో పోలీసులు తిరిగి సౌండ్ సిస్టంను అప్పగించడంతో ధర్నాను విరమించి దుర్గామాత నిమజ్జనానికి బయలుదేరారు.



ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన నాయకులు

కులం పేరుతో దూషించారని వినతి

ముప్కాల్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం బుస్సాపూర్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మహిళలపై కులం పేరుతో అసభ్యం గాకరంగా దూషించారంటూ బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు జిల్లా గోసంగి అధ్యక్షుడు వినోద్ పేర్కొన్నారు. ఆదివారం బతుకమ్మ ఊరేగింపులో గోసంగి కులానికి చెందిన మహిళలు బతుకమ్మ శోభాయాత్ర నిర్వహిస్తుండగా మున్నూరుకాపు కులస్తులు బతుకమ్మతీయవద్దంటూ గోసం గి కులానికి చెందిన మహిళలపై దాడి చేశారనిన్నారు. కులంపేరుతో దూషిం చినట్టు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో మహిళలు, గోసంగికులానికి చెందిన సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

● అక్కడికక్కడే యువకుడి మృతి



మృతుడు నవీన్

నవీపేట,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావు పారం సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాముల నవీన్(30)అనే యువకుడు మృతి చెందాడని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన నవీన్ మండలంలోని కోస్లీ శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం సమీపంలో ఉన్న 132కేవీ సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పని చేసేవాడని ఆయన పేర్కొన్నారు. పని నిమిత్తం నిజామాబాద్ వెళ్లిన నవీన్‌సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా జగ్గారావు పారం సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.మృతుడి మేనమామసాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు పరామర్శ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్, కమ్మర్‌పల్లి గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ నాయకులను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ పర్యటించారు. హసాకొత్తూర్ గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి, న్యాయవాది ఏలేటి గంగాధర్ తల్లి ఇటీవల మరణించగా ఆయనను కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, అబ్దుల్ రఫీ, పడిగెల ప్రవీన్, లింగారెడ్డి ఉన్నారు.



ఏలేటి గంగాధర్‌ను పరామర్శిస్తున్న ఈరవత్రి అనిల్



ఆంధ్రజ్యోతి ఫోకస్

సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

- ఉమ్మడి జిల్లాలో జోరుగా బియ్యం అక్రమ రవాణా
- రేషన్ డీలర్లు, వ్యాపారులు కుమ్మక్కు
- పేద ప్రజల పొట్టగొడుతున్న బియ్యం వ్యాపారులు
- జిల్లాలో అధికారుల దాడులు జరిగినా తీరు మారని వైనం
- తనిఖీలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

బాన్సువాడ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్‌డీలర్లు, వ్యాపారులు కుమ్మక్కై రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిచ్చేస్తు న్నారు. దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలందరికీ సబ్సిడీపై ప్ర భుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరుకులు సరఫరా చేస్తోంది. అయితే కొం దరు అక్రమార్కులు రెచ్చిపోయి మరి రేషన్ సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. పట్టించుకోవాల్సి న అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుం డా పోతోంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ఈ అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పేదలకు అందించాల్సిన బి య్యం రేషన్‌డీలర్లు పక్కదారి పట్టించి వ్యాపారులకు అమ్ముకుంటున్నా రు. ఇలా టన్నుల కొద్దిరే షన్ బియ్యం ప్రైవేటు వ్యాపారస్థుల గోదాంల లోకి చేరుతోంది వ్యాపారస్థులు రిటైల్‌లో బియ్యాన్ని అధిక ధరలకు అమ్ముకోవడంతో పాటు మిగిలిన బియ్యాన్ని రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఈ దందా గుట్టు చప్పుడు కాకుండా కొన్నేళ్లుగా సాగు తోంది. రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ప్రభుత్వానికే అంటగడుతున్నారు. ఈ అక్రమ దందా యథేచ్ఛగా కొన సాగుతోంది. అక్ర మ రేషన్ బియ్యం రవాణాకు కళ్లెం పడే దిశగా అధికారు లు అడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్‌ఫో ర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారుల దాడుల్లో రేషన్ బియ్యం, నిల్వలు బయట పడుతున్నా యే తప్ప మిగతా సమయాల్లో ఈ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నా యి. జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారుల దాడులు తూతూ మంత్రంగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఈఅక్రమదందాను అరికట్టేందుకు జిల్లా ఉ న్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పేదప్రజల బియ్యాన్ని పక్కదారి పోకుండా పకడ్బందీ నిఘాను ఏర్పాటు చేయాలని, అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● ఉభయ జిల్లాలో జోరుగా సాగుతున్న అక్రమవ్యాపారం

కామారెడ్డి, నిజామాబాద్ ఉభయ జిల్లాలో గల రేషన్ దుకాణాల నిర్వాహకులు ప్రతీనెల పేదలకు పంచాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. క్వింటాళ్ల కొద్ది రహస్యస్థావరాల్లో నిల్వ చేసి వ్యాపారులకు అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం పం పిణీ చేయడం చేస్తున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో రూ.20 వరకు ఉండడంతో క్వింటా బియ్యం వెనుక సుమారు రూ.2000 వరకు దండుకుంటున్నారు.

● రేషన్ డీలర్లు, వ్యాపారుల కుమ్మక్కు

రేషన్ డీలర్లకు, బియ్యం వ్యాపారులకు మధ్య బలియమైన సంబంధా లు నెలకొని ఉన్నాయి. రేషన్ డీలర్లు ప్రతీనెల క్వింటాళ్ల కొద్దిరేషన్ బి య్యాన్ని బయటి వ్యాపారస్థులకు విక్రయించుకుంటున్నారు. బయట వ్యా పారస్థులు రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్ల నుంచి రూ.వెయ్యి నుంచి రూ.1200లకు కొను గోలు చేసి అదే బియ్యాన్ని క్వింటా రూ.2వేలకు విక్రయిస్తున్నారు. మరోవైపు వ్యాపారులు పెద్దఎత్తున రేషన్ బియ్యాన్ని పోగు చేసి రైస్‌మిల్లర్లకు సైతం విక్రయిస్తున్నారు. రైస్‌మిల్లర్లు వ్యాపారుల నుంచి కొనుగోలుచేసిన బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అంటగడుతున్నారు. ఈ దందా చైన్ సిస్టంలో కొనసాగుతోంది.



● జిల్లాలో దాడులు జరిగినా తీరు మారని వైనం

పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లు, వ్యాపారు లు పక్కదారి పట్టిస్తున్న క్రమంలో అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు బడ్డారు. అయినప్పటికీ ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. అధికారులు పట్టుకున్నప్పటికీ ఒత్తిడీలకు తలొగ్గి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి.

నాణెం 'పది'లమే!

- చెలామణీ గందరగోళంపై రంగంలోకి ఆర్‌బీఐ
- పది నాణేలను తీసుకోవాలని సోషల్ మీడియా ద్వారా మెసేజీలు
- నిరాకరిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరిక
- సందేహాలు తీర్చడానికి 14440 టోల్‌ఫ్రీ నెంబరు



తెలుసుకుందాం!


నందిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.పది నాణేల చెలమణిలో సందేహాలను తీర్చడానికి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగింది. ఈ నాణేలను ఎవరూ తీసుకోకపోవడం, చెల్లవంటూ విస్తృత ప్రచారం జరగడ ంతో చాలామంది వద్ద పదినాణేలు అలాగే ఉండిపో యాయి. వీటిని ఎవరూ తీసుకుంటారో.. తమ డబ్బులు తిరిగి ఎలా చేరుతుందోనని తెలియక తికమక పడ్డారు. అయితే ఈ నాణేలు పూర్తిగా చెల్లు బాటు అవుతాయని, వాటి మారకంలో ఎలాంటి సం దేహాలు లేవని ఆర్‌బీఐ చెబుతోంది. పది నాణేలు తీసుకోవాలని సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు ఇస్తోంది. రూ.10, 20 నాణేలను ఎవరైనా తిరస్కరిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్న టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ప్రజలకు అన్ని నెట్‌వర్క్‌ల ద్వారా సెల్ ఫోన్లకు సోషల్ మీడియాలో మెసేజ్‌లను పంపుతోంది. పది, 20 నాణేలు అన్నిచోట్లా చెలామణీలో ఉన్నాయని, ఎవరూ ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేసినా, సందేహాలు ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబరు 14440కు మిస్స్‌డ్ కాల్ ఇవ్వాలని పేర్కొంది. ఈ పది నాణేలపై 10 గీతలు, 15 గీతలు ఉన్నా చెలామణీ అవుతాయని మెసేజ్‌ల ద్వారా ఆర్‌బీఐ తెలుపుతోంది. ఎవరైనా నాణేలను తిరస్కరిస్తే మూడేళ్ల జైలుశిక్ష తప్పదంటోంది. అటువంటి వారిపై ఐపీసీ సెక్షన్ 124ఏ ప్రకారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తోంది. రుజువైతే మూడేళ్ల జైలు అనుభవించాల్సిందేనని ఆర్‌బీఐ హెచ్చరిస్తోంది.

సందేహాలు నివృత్తి అయ్యేనా ?

రిజర్వ్ బ్యాంకు ముద్రించిన పది నాణేల చెలామణిలో ప్రస్తుతం గందరగోళం ఏర్పడింది. వీటిలో నకిలీవి తయారవుతున్నాయని గతంలో పుకార్లు షికార్లు చేయడంతో ఎవరు ఇచ్చిన తీసుకోవడానికి ఇష్టపడలేకపోయారు. ఏవ్యాపారి అయినా రూ.10,20 నాణేలకు దండం అంటూ తిరిగి ఇచ్చేస్తున్నారు. అంతే కాకుం డా ఆర్‌టీసీ బస్‌లు, ప్రైవేట్ వాహనాలలో సైతం పది నాణేల కాయిన్లు తీసుకోలేకపోయారు. తమ వ ద్దఉన్న రూ.10, 20 కాయిన్లు ఎవరూ తీసుకోకపోవ డంతో ఏం చేయాలో తెలియక చాలామంది ప్రజలు తమ ఇళ్లలో పారేశారు. అయితే వీటిపై పత్రికల్లో వార్తాలు రావడంతో రిజర్వ్‌బ్యాంకు స్పందించి అనేక మార్లు పత్రిక ప్రకటనలను విడుదల చేసింది. వర్తకులు, ఇతర వర్గాల వారు రూ.పది కాయిన్లు తీసుకోవాలని పేర్కొంది. ఎవరైనా తీసుకోకపోయినా, ఇబ్బంది పెట్టినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. ఎవరూ ఎన్నిరకాల ప్రకటనలు, హెచ్చరికలు జారీచేసినా రూ.10 నాణేల కాయిన్లు పూర్తి స్థాయిలో చలామణీలోకి రాలేదు. అంతేకాదు ఈ కాయిన్లతో బ్యాంకులకు వెళ్లినావారు సైతం నిరాకరించడంతో వీటి చెలామణీ పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఆర్‌బీఐ మళ్లీ రంగంలోకి దిగి ప్రజల్లోని సందేహాలను నివృత్తి చేయడానికి యత్నిస్తోంది.

రూ.పది నాణాలు చెల్లుతాయి

- నాగిరెడ్డిపేటలో దుకాణాల ఎదుట స్టిక్కర్లను అతికిస్తున్న బ్యాంకు సిబ్బంది



దుకాణాల వద్ద అతికిస్తున్న స్టిక్కర్ ఇదే..



హోటల్ ఎదుట స్టిక్కర్‌ను అతికిస్తున్న స్థానిక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రూ.పది నాణాలు చెల్లుతాయని, ఇందులో ఎవరికి ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ప్రజలు, వ్యాపారస్తులు రూ.10 నాణాలు తీసుకోవాలని స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సాగర్ షిండే, అసిస్టెంట్ మే నేజర్ సందీప్‌లు కోరారు. ప్రజల్లోనూ, వ్యాపారస్తుల్లో నూ 10 రూపాయల నాణెం చెల్లదన్న అపోహలు ఉం డటంతో వారిలో ఉన్న అపోహలను తొలగించేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా పది రూపాయల నా ణెలు చెల్లుతాయని ఆదేశించిందని వారు తెలిపారు. 10 రూపాయల నాణాలు చెల్లుతాయని ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ ద్వారా జారీ చేసినట్లు ముద్రించిన స్టిక్కర్లను మండల కేంద్రంలోని అన్ని వాణిజ్య, వ్యాపార, కిరాణా, హోటల్‌లు ఇతర దుకాణాల ఎదుట గోడలపై బ్యాంకు సిబ్బంది ద్వారా అతికిస్తున్నామన్నారు. 10 రూపాయల నాణా లు ప్రజల వద్ద నుంచి తీసుకోవాలని వ్యాపారస్తులకు సూచిస్తున్నామని వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పది రూపాయల నాణాలు చెల్లవని చెబుతూ ప్రజల వద్ద నుంచి నాణాలు తీసుకుని వ్యాపారస్తులపై చట్టపరమైన చ్యలు తీసుకుంటామని వారు తెలిపారు. సోమవారం స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సందీప్ మండల కేంద్రంలోని అన్ని వ్యాపార, దుకాణాలు, హోటళ్ల వద్ద గోడలపై స్టిక్కర్లను అతికించారు. పది రూపాయల నాణాలు చట్టబద్ధమైనవని వీటిని ప్రజలు వ్యాపారులు రోజువారి లావాదేవీలకు ఉపయోగించవచ్చని బ్యాంకు అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని ప్రతీ ఖాతాదారునికి రూ.100 చొప్పున రూ.పది పది నాణాలను వారికి ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.



జై భవాని..

- వైభవంగా మార్కండేయ మందిరం దేవీమాత శోభాయాత్ర
- హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

భక్తి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జై భవానీ.. దేవీ నామస్మరణ.. మంగళవాయిద్యాలతో మార్కండేయ మందిర దేవిమాత శోభాయాత్ర వైభవోపేతంగా సాగింది. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులపాటు భక్తులచే పూజలందుకున్న దేవీమాత నిమజ్జన శోభాయాత్రకు తరలివెళ్లింది. భక్తులచే పూజలందుకున్న అమ్మవారు డప్పు వాయిద్యాలు, కేరళ కళాకారుల వాయిద్యాలు, వివిధ వేషాదారణలతో ఊరేగింపుగా తరిలారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్కండేయ మందిర దేవిమాత శోభాయాత్ర ఘనంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రకు మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పలుకగా భక్తులు పూలవర్షంతో, కొబ్బరికాయలతో ఘనస్వాగతం పలికారు. శోభాయా త్ర దారిపొడవున కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నా యి. జైమాతా జైజై మాతా... జైచండీ జైజై చండీ... అంటూ భక్తులు నినాదాలతో హోరెత్తింది. భక్తుల భజనలు, భక్తి పాటలతో నిమజ్జన ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. అమ్మవారి రథయాత్రలో భక్తులు టపాసులు, బాణాసంచాలు పేలుస్తూ అమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.

అమ్మ అనుగ్రహంతో అభివృద్ధి చేస్తా..: మహేష్

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనందంగా ఉందని టీపీ సీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మార్కండేయ మందిర దేవిమాత నిమజ్జన శోభాయా త్రను పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ అమ్మ అనుగ్రహంతో జిల్లాను అభివృద్ధి చేస్తానని అన్నారు. ని జామాబాద్ అన్ని మతాల పండుగలను కలిసి కట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వ ర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించినందని త్వరలోనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో గనుల అభివృద్ధి క మిటీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్, సహకార యూ నియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు రత్నాకర్ పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు



శోభాయాత్రలను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్





కళాకారుల విన్యాసాలు

గ్రామీణులకు అందని మందులు

- 104 వాహనాల సేవల రద్దుతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు
- వాటికి ప్రత్యామ్నాయంగా తెచ్చిన ఎన్‌సీడీ కిట్ల పంపిణీ అంతంతే..
- 104 సేవలను తిరిగి వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

మద్నూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు సమీపంలో వైద్యసేవలు అందడం.. ఏదైనా ప్రమాదం జరిగితే సమీప వైద్య వసతికి తొందరగా తీసుకెళ్లడం కోసం 104, 108 వాహనాలను గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభించింది. అందులో 108 అంబులెన్స్ సేవలు ఇప్పటికే నడుస్తుండగా 104 వైద్య సేవలను గత ప్రభుత్వం 2021లో నిలిపివేసింది. దానిస్థానంలో అసంక్రమిత వ్యాధులపై సర్వేచేసి ఎన్‌సీడీ (నాన్ కమ్యూనబుల్ డీసీసెస్) కిట్లను పంపి ణీ చేయాలని నిర్ణయించింది. ఈ కిట్లను పీహెచ్‌సీలకు వచ్చి తీసుకెళ్లడం లేదా ఏఎన్‌ఎం ద్వారా పంపిణీ చేయాలని సంకల్పించింది. ఈ విధానం ద్వారా ప్రస్తుతం వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు తదితరులకు మందులు సరైన క్రమంలో అందడం లేదు. పీహెచ్‌సీలకు వెళ్లి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారడంతో ప్రైవేట్ మందులపై ఆధారపడుతున్నారు. కొన్నికోట్ల రూపాయలు ఖర్చుచేసి రూపొందించిన వాహనాలు మూలకుపడగా అందులో పని చేసే సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఎక్కడ పడితే అక్కడ వేశారు. వారికి వేతనాలు విషయంలో కూడా ఒక వ్యవస్థ అంటూ లేకుండాపోయింది. 104 వాహనాలపై డ్రైవర్లను గిఫ్ట్ ఏ స్మైల్ కింద వచ్చిన అంబులెన్స్‌కు వినియోగించుకుంటా మని చెప్పింది. సదరు అంబులెన్స్‌లకు ఇంకా ప్రొవిజన్ కూడా రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో ఆపార్టీ ఫ్లాగ్ షిప్ కార్యక్రమంలో 104ఒకటి కాబట్టి, దాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ రోజురోజుకు బలపడుతోంది. ఎన్‌సీడీ కిట్లు ఇంటింటికీ తిరిగి ఏఎన్‌ఎంలతో ఇప్పిస్తున్నామని చెబుతున్నా వారికి ఇతర పనిఒత్తిడి కారణంగా పేదలకు ఇబ్బందులు తప్ప డం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో అధికారంలో ఉన్న ప్పుడు వైద్యఆరోగ్యశాఖలో 104, 108 విధాన నిర్ణయాలతో పాటు ఆరోగ్య శ్రీని విప్లవాత్మకంగా తెచ్చింది. ఆ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ళ తరువాత టీఆర్‌ఎస్ అధికార ంలో ఉన్న ఏడేండ్ల పాటు 104 సేవలు కొనసాగించారు. ఒక్కోవాహనం నెలకు క్యాలెండర్ ప్రకారం పీహెచ్‌సీ పరిధిలో 60 గ్రామాల వరకు కవర్ చేయాల్సి ఉండేది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 గంటల వరకు వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలకు ఫిక్స్‌డ్ హెల్త్ సర్వీసెస్ సేవలు అందించేవారు. బీపీ, షుగర్, అస్తమా, ఫిట్స్, జ్వర ం, దగ్గు, జలుబుకు సంబంధించిన మందులతో పాటు గర్భిణీలకు పోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలను పంపిణీ చేసేవారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి హెచ్చు తగ్గు లను బేరీజు వేసి మందులు ఇచ్చేవారు. అయితే నాన్ కమ్యూనబుల్ డీసీసెస్ సర్వే చేపట్టిన తరువాత ఆయా గ్రామాలలో మండలాలలో ఎంతమంది బీపీ, షుగర్, క్యాన్సర్ రోగులు ఉన్నారు గుర్తించారు. అందుకు ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీని పరిగణలోకి తీసుకున్నారు. గుర్తింపు వరకు బాగానే ఉన్నప్పటికీ తరువాత కిట్ల పేరుతో 104 సేవలకు మంగళం పాడారు. దీంతో వృద్ధులు పీహెచ్‌సీలకు వెళ్లి కిట్లను తీసుకోలేక వాడటం మానేస్తు న్నారు. మందులు వాడక పోవడంతో గుండెపోటు, పక్షవాతం వంటి వాటికి దారితీస్తుందని ఆందోళన వ్యక్త మవుతోంది. అవసరం మేరకు ఎన్‌సీడీ కిట్లను తీసుకోకపో వడంతో స్టాక్ కావాల్సినంతా ఉందని చెప్పుకోవడానికి మా త్రమే పనికి వస్తుంది. కార్పొరేటర్ ప్రైవేట్ ఆసుపత్రుల ఒత్తిడితోనే ఈ సంచార వైద్యశాలల విధానాన్ని పక్కన పె ట్టారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. దీనిని గతంలో ప్రార ంభించిన ప్రభుత్వమే ప్రస్తుతం అధికారంలో ఉండటంతో పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

జరదేఖో!!



గ్రామీణ ప్రాంతాలలో పేదలకు మందులు పంపిణీ చేసే 104 వాహనం (ఫైల్)

ఆంధ్రజ్యోతి
ఆర్మూర్, బాల్కొండ



గౌడ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

అభివృద్ధికి రాజకీయ పార్టీలు అడ్డుగా మారొద్దు

టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో రాజకీయ పార్టీలు అడ్డుగా మారవద్దని పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి నాయకులు ముందుకు రావాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో రేణుక గౌడ సంఘ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నగరంలో గౌడ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సీఎం, డిప్యూటీ సీఎంలతో మాట్లాడి నిజామాబాద్‌లో గౌడసంఘం అభివృద్ధి, భవన నిర్మాణాల కోసం మరిన్ని నిధులు తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, స్థానిక కార్పొరేటర్ న్యాలం రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, రత్నాకర్, వైసాక్షి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ..

దసరా పండుగను పురస్కరించుకొని నిజామాబాద్‌కు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న ఆయనకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపేందుకు రావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. సుమారు ఐదు గంటల పాటు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మహేష్‌కుమార్‌గౌడ్ వివిధ వర్గాలకు చెందిన ప్రజలను, కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కలిశారు. కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్, కేశవేణు, రత్నాకర్, మీసాల సుధాకర్‌రావు, మాల్యాల గోవర్ధన్, బుజ్జి, తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త రెవెన్యూ చట్టంలో భాగంగా క్యాడర్ స్ట్రెంత్ పెంచి ఇతర జిల్లాలకు కేటాయించిన వీఆర్‌ఏలను తిరిగి సొంత జిల్లాలకు కేటాయించాలని పాత వీఆర్‌ఏలు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని అభయహస్తం కాలనీ, బహుజన కాలనీలలో అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని మాల్యాల గోవర్ధన్, తదితరులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిరాజ్ కళాశాల పూర్వ విద్యార్థులు సైతం మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో కోనేరు సాయికుమార్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, రమేష్, సాయిలు, తదితరులు ఉన్నారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పొడిగింపు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ, పీజీ, డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు గడువును నవంబర్ 15 వరకు పొడిగించినట్లు అధ్యయన కేంద్ర సమన్వయకర్త రాము తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 99126 70252 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు రైతువేదిక భవన్‌లో సమావేశం

మోపాల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నీటి సహాయకులకు మంగళవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏఈ వినయ్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా నీటి సహాయకులకు చేతిపంపుల రిపేర్, మోటార్ రిపేర్, ప్యానెల్‌బోర్డు రిపేర్, పైప్‌లైన్ రిపేర్, నీటి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, అక్టోబర్14 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి తెలంగాణ ప్రత్యేక పోలీసు 7వ బెటాలియన్‌లో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఆరాధన ఉదయము గరుడ ప్రతిష్ఠశాల ప్రవేశము, హోమ కుంభ స్థాపన, వాస్తు స్థాపన అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ, హోమం వాస్తు హోమాము, గరుడ తత్వ హోమం, ప్రాణ ప్రతిష్ఠ హోమం, ధ్వజారోహనము పురోహితులు నిర్వహించారు. సాయంత్రం బేరిపూజ దేవతా ఆహ్వానము, నిత్య హవనము, బలి హరణము, మరియు రాత్రి 7గంటలకు హనుమంత వాహన సేవా మరియు హారతి మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొడుకు కోడలిపై కేసు నమోదు

సిరికొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కన్న తల్లికి అన్నం పెట్టక పోగా.. దాడికి పాల్పడిన కొడుకు, కోడలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన మాలవత్ లింబిని ఆమె కొడుకు నాను అతడి భార్య సరిత సరిగా చూసుకోకపోవడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో లింబి అక్క మాలవత్ శాంతబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సరిత, నానుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్ తెలిపారు.

'ప్రజావాణి'కి 51 వినతులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం 51 వినతులు వచ్చాయి. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌లు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటిని పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ కృషి : రూరల్ ఎమ్మెల్యే

మోపాల్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: విద్యాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ రూరల్ క్యాంప్ కార్యాలయంలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీకి త్వరలో జరుగనున్న ద్వైవార్షిక ఎన్నికల్లో ఓటరు నమోదు ప్రక్రియలో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల పాత్రపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా, జ్యోతిబాపూలే, ట్రిబుల్ ఐటీలలో చదువుకుంటున్న విద్యార్థుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో సుమారు 5లక్షల మంది పట్టభద్రులు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఎన్నికల్లో మన అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాసాగర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, అమృతాపూర్ గంగాధర్, నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నేడు రామడుగు ప్రాజెక్టును సందర్శించనున్న ఎమ్మెల్యే..

ధర్పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు ప్రాజెక్టును మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సందర్శించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్ రాజ్ తెలిపారు. ఉదయం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రాజెక్టులోకి చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

దసరాతో ఎక్సైజ్‌కు ఆదాయం

● గతంలో పోలిస్తే మద్యం అమ్మకాలు డబుల్

సుభాష్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ఎక్సైజ్‌కు ఆదాయాన్ని తెచ్చి పెట్టింది. మూడు రోజుల పాటు ఎక్సైజ్ శాఖకు రెండింతల ఆదాయాన్ని తెచ్చి పెట్టింది. దసరాతో పాటు మూడు రోజులు కలిపి సుమారు రూ.20 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. ఇందులో దసరా పండుగ రోజు సుమారు రూ.10కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. బుధ, గురువారాల్లో మరో రూ.10 కోట్లు ఆదాయం రాగా శుక్రవారం ఒక్కరోజే రూ.10 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇందులో లిక్కర్ 10వేల 142 కేసులు అమ్ముడు పోగా, బీర్‌లు 17వేల 803 కేసులు అమ్ముడు పోయాయి. బుధవారం 5వేల 63 లిక్కర్ కేసులు అమ్ముడుపోగా, 9వేల 574 కేసులు అమ్ముడు పోయి వాటి ద్వారా సుమారు 5.46లక్షల ఆదాయం వచ్చింది. గురువారం లిక్కర్ 4598 కేసులు అమ్ముడు పోగా 9211 బీర్ల కేసులు అమ్ముడు పోయాయి. వీటి ద్వారా సుమారు 5.12 లక్షల ఆదాయం వచ్చింది. గతంలో దసరా రోజు కేవలం 7.10 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. గతంలో పోలిస్తే ప్రస్తుతం ఆదాయం పెరిగింది.

నేటి నుంచి పశువులకు టీకాలు

రుద్రూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి వచ్చే నెల 15వ తేది వరకు రుద్రూరు మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లోని పాడి పశువులకు ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలను వేయడం జరుగుతుందని సోమవారం మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15, 16న (మంగళవారం) బొప్పాపూర్, 17, 18న అక్బర్ నగర్, 19న లక్ష్మీపూర్ క్యాంప్, 21, 22న అంబం (ఆర్), 23న కొండాపూర్, 24, 25వ తేదిలలో చిక్కడపల్లి, 26, 28న సులేమాన్‌నగర్, 29, 30న రాణంపల్లి, 31, నవంబర్ 1న రాయకూర్, 2, 4వ తేదీన రాయకూర్ క్యాంప్, 5వ తేదిన సిద్దాపూర్, 6న సిద్దాపూర్ క్యాంప్‌లలోటీకాలు వేయడం జరుగుతుందన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో మంగళవారం నుంచి నవంబర్ 11వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల నివారణ శిబిరం ఉంటుందని పశువైద్యాధికారిణి శిరీష తెలిపారు. మంగళవారం కొలిప్యాక్, 16న కలిగోట్, 17న చింతలూర్, 18న బ్రహ్మణ్‌పల్లి, 19న తొర్లికొండ, 21న మునిపల్లి, 22న నల్లగుట్టతాండా, 23న లక్ష్మాపూర్, 24న నారాయణపేట్, 25న అర్గుల్, 26న పుప్పాలపల్లి, 28న మాదాపూర్, 30న గన్యతాండా, నవంబర్ 1న సికింద్రాపూర్, 2న కేశ్‌పల్లి, 4న పడకల్, చందమి యాబాగ్‌తండా, 6న మనోహరాబాద్, 9న వివేక్‌నగర్‌తాండా, 11న జక్రాన్‌పల్లి గ్రామాల్లో పశువు లకు గాలికుంట వ్యాధి టీకాల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలం అంబం(ఆర్) గ్రామంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 9,10వ తరగతి, ఇంటర్మీడియట్ భౌతిక శాస్త్రం (హవర్లీబేసిస్) బోధించుటకు దరఖాస్తులను ఆ హ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భౌతిక శాస్త్రంలో పీజీ, బీఈడీ అర్హత కలిగిన వారు ఈనెల 16వ తేదీలోపు తమ దరఖాస్తులను అందజేయాలని ఆయన కోరారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

హాకీ పోటీలకు బాలుర జట్టు ఎంపిక

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ బాలుర అంతర్ జిల్లాల హాకీ పోటీలో పాల్గొనే జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టును సోమవారం ఆర్మూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు సుమారు 40మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో నుంచి ప్రతిభ చూపిన 18మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి సదామస్తుల రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల హాకీ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మహమ్మద్‌హరీఫ్, సడాక్ నగేష్, సీనియర్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించాలి

మాక్లూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని ఢీకంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

పెర్కిట్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టా భద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రతీ యొక్క పట్టా భద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. నవంబర్ 6వ తేదీలోపు ప్రతీఒక్క పట్టాభద్రుడు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టాభద్రుల ఎన్నికల ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్, కోఆర్డినేటర్ మిర్యాల్‌కర్ కిరణ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు దొండి ప్రకాష్, ఓబీసీ మోర్చ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు బాశెట్టి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యల పరిష్కరించాలి

ఆర్మూర్‌రూరల్, (ఆంధ్రజ్యోతి), అక్టోబరు14: గురుకుల అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గురుకుల అభ్యర్థులు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

జాతీయ స్థాయి కథల పోటీలో బహుమతి

ఏర్గట్ల, అక్టోబరు 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి కె అభిలాష్‌కు జాతీయ స్థాయి కథల పోటీల్లో బహుమతి లభించినట్లు పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. మాచిరాజు బాల సాహిత్య కళా పీఠం వారు నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీల్లో విద్యార్థి అభిలాష్ రాసిన మంచి మనసు అనే కథ ఎంపికైందని, నవంబర్‌లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే బహుమతల ప్రధానంలో నగదు, ప్రశంసా పత్రం అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి'

డొంకేశ్వర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి బీజేపీ సభ్యత్వ నమోదు చేయించాలని బీజేపీ జిల్లా సభ్యత్వ అబ్జర్వర్ కోటపాటి నర్సింహంనాయుడు అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండలంల్లోని ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన సభ్యత్వ నమోదు వివరాలను ఆయన అడిగితెలుసుకుని ప్రతీ బూత్ నుంచి 400 సభ్యత్వ నమోదు చేయాలని, మండల వ్యాప్తంగా ఏడు వేల సభ్యత్వాల వరకు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, బీజేపీ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సాగర్, మహేందర్‌గౌడ్, రుక్మాజీ, మహేష్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

ఇందల్వాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరివేసుకొని మహిళ మృతి చెందిన ఘటన చంద్రయాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వేముల మనోజ (25) ఇంట్లో గొడవపడి ఊరుపక్కన గల పెద్ద పోచమ్మ ఆలయం వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిందని తెలిపారు. ఆమె స్వగ్రామం కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిందని అన్నారు. డిచ్‌పల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలుకు గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగినట్లు తెలిపారు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన సాయిలు మూడు సంవత్సరాల నుంచి చంద్రయాన్‌పల్లి గ్రామంలో ఉంటూ డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని అన్నారు. ఆదివారం ఇంట్లో భర్త సాయిలు అత్తమామలతో గొడవ పడ్డ మనోజ సాయంత్రం బయటకి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమె కోసం గాలించగా గ్రామ శివారులోని పెద్ద పోచమ్మ ఆలయం వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు, పుట్టింటివారికి సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఆమె పుట్టింటి వారు మనోజను భర్తే చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ శవాన్ని తరలించేందుకు ససేమీరా అనడంతో రాత్రి 11.30 గంటల వరకు అక్కడ ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఎట్టకేలకు పోలీసులు, గ్రామపెద్దలు మృతురాలి కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి అర్ధరాత్రి సమయంలో పంచనామా నిమిత్తం మనోజ మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి మూడు సంవత్సరాలలోపు ఇద్దరు కుమారులు ఉన్నారని, మృతురాలి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు భర్త సాయిలుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నేడు మండల స్థాయిలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవి, మోడల్ స్కూల్ విద్యార్థులకు మండల స్థాయిలో ఈనెల 15న కళా ఉత్సవ్-2024 పోటీలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డ్యాన్స్, థియేటర్, విజువల్ ఆర్ట్స్, స్టోరీ టెల్లింగ్ అంశాలలో పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులను ఈనెల 16, 17 తేదీలలో జిల్లా స్థాయి ఎంపికలు జరిగే బాల్‌భవన్ నిజామాబాద్‌కు ఓ గైడ్ టీచర్ సహాయంతో పంపించాలని ఆయన తెలిపారు.

ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు మైథిలి ఎంపిక

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి మైథిలి ఎంపికైనట్లు ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖుల్లాలు తెలిపారు. బాల్కొండ కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న మైథిలి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో ఈనెల 15 నుంచి 17వరకు జరిగే జూనియర్ సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికవడం జరిగిందన్నారు. ఎంపిక కావడం పట్ల అసోసియేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావులు హర్షం వ్యక్తం చేశారు.



ఎంపికైన మైథిలి

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన తూంపల్లి విద్యార్థులు

సిరికొండ, అక్టోబరు 14: రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ హాకీ క్రీడా పోటీలకు మండలంలోని తూంపల్లి హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.నగేష్ తెలిపారు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ క్రీడల పోటీలకు తూంపల్లికి చెందిన పి.రంజిత్, టి.గోపాల్, ఎల్ వినోద్, ఎ.మనోహర్, బి.నితీన్ ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ నెల 14న ఆర్మూర్ పట్టణంలో జరిగిన సెలెక్షన్ పోటీలలో ఈ ఐదుగురు విద్యార్థులు క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించడం వల్ల జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

ధర్పల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల రేణుకదేవి ఎల్లమ్మ దేవాలయ పంచమ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 13న ప్రారంభమైన ఉత్సవాలు 22 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. 15న పూర్ణాహుతి, అభిషేకం, కళ్యాణం, అన్నదాన కార్యక్రమం, 16న ఉత్సవ విగ్రహ పూజ, మంగళహారతి, 18న ఉత్సవ విగ్రహాన్ని ఇంటింటికి శోభాయాత్ర, 19న గ్రామంలో జోగు, 20న పోచమ్మ బోనాలు, 21న గంగ బోనం, 22న ఎల్లమ్మగుడి వద్ద ప్రత్యేక కార్యక్రమాలు, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

హార్వెస్టర్ లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన హార్వెస్టర్(వరికోత మిషన్)ను లీజు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం చిన్నయ్య ఓప్రకటనలో తెలిపారు. ఈ వర్షకాలం సీజన్ కావడంతో ఆసక్తి గల వారు మండలంలోని ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రేపు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనుక ప్రమోద్ తెలిపారు. నగరంలోని శ్రావ్యాగార్డెన్‌లో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనక ప్రమోద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టులో ఆమోదించబడ్డ రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు అమలు చేయకపోవడం మాదిగ జాతి ఉపకులాల ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.95	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.225	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78700	రూ.72000	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : విశ్వం (9.20)
: విట్టయ్యన్ (12.35)
: దేవర (4.05)
: జనక అయితే గనక (7.40, 10.40)
స్క్రీన్-2 : జనక అయితే గనక (10.10, 4.10)
: మా నాన్న సూపర్ హీరో (1.10)
: విశ్వం (7.15, 10.30)
స్క్రీన్-3 : విక్కీ విద్య కా ఓ వాలా వీడియో (హిందీ) (10.05)
: మార్టీన్ (1.25)
: వెట్టయ్యన్ (4.30, 10.50)
: మా నాన్న సూపర్ హీరో (8.00)
స్క్రీన్-4 : జిగ్రా (తెలుగు) (9.25) : విశ్వం (12.55)
: జిగ్రా (హిందీ) (4.15) : మార్టీన్ (7.35)
: విక్కీ విద్య కా ఓ వాలా వీడియో (హిందీ) (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : విశ్వం (10.30, 4.10, 10.35)
: జనక అయితే గనక (1.30)
: దేవర (7.25)
స్క్రీన్-2 : జిగ్రా (హిందీ) (10.30, 1.30, 10.20)
: మా నాన్న సూపర్ హీరో (4.30)
: జనక అయితే గనక (7.30)
స్క్రీన్-3 : విట్టయ్యన్ (10.20, 1.25, 4.30, 7.35, 10.40)

దేవి: మార్టిన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వెట్టయ్యన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్